జాతీయ తెలుగు దినపత్రిక



# ప్రజా జ్యోతి

ప్రతి అక్షరం - ప్రజాల కోసం

## నిజామాబాద్

ఆదివారం 20 సెప్టెంబర్ 2024 www.prajajyothinews.com పేజీలు :03

## ఆర్మూర్ ఏఎంసి చైర్మన్ గా

# సాయిబాబా గౌడ్



ప్రజాజ్యోతి ఆర్మూర్ ప్రతినిధి:

ఆర్మూర్ ఏఎంసీ ఛైర్మన్ గా ఎట్టకేలకు సాయిబాబా గౌడ్ పేరు ఖరారైనట్లు తెలిసింది. జిల్లాలోని అన్ని ఏఎంసీలకు పాలకవర్గాలు ఏర్పాటై ప్రమాణ స్వీకారం పూర్తి కాగా, ఆర్మూర్ ఏఎంసీ మాత్రం పెండింగ్లో పడింది. ఛైర్మన్ పదవికి ఆర్మూర్ పట్టణాధ్యక్షుడు సాయిబాబాగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీవన్ పోటీపడగా.. సాయిబాబా గౌడ్ పేరును ఫైనల్ చేసినట్లు సమాచారం. జీవన్కు వైస్ ఛైర్మన్గా, పలువురిని డైరెక్టర్లుగా నియమించినట్లు వినికిడి. అతి త్వరలో అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు తెలిసింది.

# మహాలక్ష్మి అమ్మవారి భోనం ఎత్తిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



వినాయక నగర్ కంటేశ్వర్ లో నిర్వహించిన మహాలక్ష్మి అమ్మ వారి బోనాల పండుగ ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ధన్ పాల్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ పండుగలలో ఒకటి బోనాల పండుగని రాష్ట్ర వ్యాప్తంగా ఆశడమాసం నుండి ప్రజలందరు భక్తి శ్రద్దలతో బోనం చేసి అమ్మవారిని కొలవడం అనవయితీగా వస్తుందని అన్నారు.
భక్తి శ్రద్దలతో అమ్మవారికి పూజలు చేసి, నైవేద్యం సమర్పించడం జరుగుతుందని, సకాలంలో వర్షాలు కురిసి రైతన్నలు అధిక పంటలు పండించాలని పిల్లజల్లా, గొడ్డు గోదా అన్నింటిని కాపాడాలని ఆ అమ్మవారిని పూజించడం జరుగుతుందని అన్నారు. అమ్మవారే స్వయంగా తమ ఇంటికి వచ్చినట్లు భక్తులందరు భావిస్తారని అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే అని అన్నారు అమ్మవారు ఇందూర్ నగర ప్రజలందరిని అష్టఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో కాపాడాలని, ఆ అమ్మవారి ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మి నారాయణ, మహాలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, బీజేపీ నాయకులు,19 వ డివిజన్ నాయకులు,మున్నూరు కాపు సంఘ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.


- ప్రజాజ్యోతి , నిజామాబాద్ బ్యూరో :














## నూతనంగా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన యువతను ఘనంగా సన్మానించినా మాజీ సర్పంచ్



**బోధన్ ప్రతినిధి అక్టోబర్ 20(ప్రజాజ్యోతి):**ఇటీవల విడుదలైన డిఎస్సి ఫలితాలలో రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన కంఠం బాలకృష్ణ (ఎస్జిటీ), హైమాద్ పాషా (పిఈటీ), ఉమేరా పాతిమ (ఎస్జిటీ), లు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ ఏకర్ పాషా వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మా గ్రామ యువతకు ఉపాధ్యాయ ఉద్యోగం రావడం చాలా గర్వంగా ఉందన్నారు అలాగే గ్రామంలోని యువకులంధరు వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్క యువకుడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హైమాధ్, హాజీ ఖాన్, భుమేష్, రాఫీక్, నరేష్, గంగాధర్, సంతోష్ ,చింటూ, సాధిక్, కారామాత్ ,జలిల్, ఆసీఫ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కోదండరామ్‌ని కలిసిన పాత పెన్షన్ పోరాట సమితి నాయకులు



**ప్రజాజ్యోతి నిజామాబాద్ బ్యూరో:**
నిజామాబాద్ కు విచ్చేసిన ఎమ్మెల్సీ కోదండరామ్ ని 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో కలిసారు. 2003 ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆలస్యంగా పోస్టింగ్ లు ఇవ్వడం వలన దాదాపు 9000 ల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు సిపిఎస్ విధానం లోకి వచ్చారని ఇలాంటి వారందరికీ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికి మెమో 57 ఆధారంగా పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు అమలు చేయాలని సూచించిందన్నారు. దేశం లోని అనేక రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా 2003 ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేశాయని మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 2003 ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు రవిందర్, విజయ్ కుమార్, గుత్ప ప్రసాద్, సురేందర్, శ్రీహరి, రామకృష్ణ, ప్రవీణ్ రెడ్డి, గంగాధర్, శ్రీధర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వందలాది మంది బలిదానాలతో తెలంగాణ సిద్ధించింది

### - రాష్ట్ర జేపీసీ చైర్మన్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



ప్రజా జ్యోతి , నిజామాబాద్ బ్యూరో : కోట్లాది మంది ఉద్యమిం చడంతో పాటు ఎంతో మంది బలిదానాలు చేయడంతో తెలంగాణ సిద్ధించిందని రాష్ట్ర జేపీసీ చైర్మన్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్ లో ఏర్పాటు చేసిన అభినందన సభ కార్యక్రమంలో కోద ండరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలందరూ కలిసికట్టుగా పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోగా కేవలం తన ఒక్కడి వల్లే రాష్ట్ర సాధన సాధ్యమైందని కేసీఆర్ గత పదేళ్లుగా మోసం చేస్తూ వస్తున్నారని అన్నారు.కేసీఆర్ తన రాజకీయ స్వలాభం కోసం ఉద్యమ చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ ఉద్యమకారులకు అడుగడుగునా అవమానం, అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన తరువాత నిజామాబాద్ లో అభినందన సభ ఏర్పాటు చేసిన జేఏసీ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. సాధారణంగా సన్మానాలు తకు నచ్చవని, ఈ వేదిక ద్వారా సమస్యలపై మాట్లాడటం, ఉద్యమం గురించి మాట్లాడే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో వచ్చానని అన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలుపరచాలి

### - ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి కోటేశ్వరరావు



**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు రైతులకు ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని వెంటనే అమలుపరచాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలో గల ఎన్ఆర్ భవన్ లో జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అధ్యక్షతన జరిగింది, ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షులు వి కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలు చేపడుతున్నాయని ఆయన అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం చారిత్రాత్మక రైతు ఉద్యమానికి ఇచ్చిన లిఖితపూర్వక హామీ, వ్యవసాయ రంగంలో తెచ్చిన మూడు నల్ల చట్టాలను ఉపసంహరించుకొని ఎంఎస్పి మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని తీసుకువస్తానని రైతు అప్పులను మాఫీ చేస్తానని విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకొని రైతులపై మోపబడిన కేసులు అన్నింటిని ఎత్తివేస్తానని ఉద్యమ సమయంలో మరణించిన కుటుంబాలను ఆదుకుంటానని రైతులందరికీ పరిహారం చెల్లించి వారిని ఆదుకుంటానని, ఇచ్చిన హామీలు అమలు చేయలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాల్లో కార్పొరేట్ కంపెనీలకు పెద్దపీట వేస్తున్నారని పంట భూములను పారిశ్రామికవేత్తలకు బడా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే విధానాలను అవలంబిస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం అవుతున్నారని ఈ జిల్లాలో మూతపడిన రెండు చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని అందుకుగాను మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో సబ్ కమిటీని వేశారని ఇలా కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించి నడిపించాలని డిమాండ్ చేశారు. ఎన్ సి ఎస్ ఎఫ్ సారంగాపూర్ చక్కర ఫ్యాక్టరీని బెల్లం కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నడిపించాలని అన్నారు. బెల్లం కు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని పైగా దీనికి జిఎస్టి ఉండదని ఈ ప్రాంత రైతులు ఫ్యాక్టరీతెరిస్తే చెరుకు పండించేందుకు సిద్ధంగా ఉన్నారని వారన్నారు. వరి పంట కోతకొచ్చినందున కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం లేదని కోతలు ప్రారంభమై రైతులుపంట ఆరబోసుకుంటున్నందున వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఈ ఖరీఫ్ పంట నుంచి చెల్లించాలని ఇది అన్ని రకాల పంటలకు అమలు పరచాలని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రెండు లక్షల రుణమాఫీ అమలుపరచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, ప్రధాన కార్యదర్శి సాయి రెడ్డి, ఉపాధ్యక్షులు ఎర్రయ్య. టి కృష్ణ గౌడ్ సహాయ కార్యదర్శి ఏ చిన్నయ్య. శ్రీనివాస్ రెడ్డి బాబురావు. మార్చ్ప .గోపాల్ విటల్. తదితరులు పాల్గొన్నారు.

# బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

### బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు




**ప్రజాజ్యోతి, నిజామాబాద్ బ్యూరో :** నిజామాబాద్ జిల్లా కేంద్ర జనరల్ ఆసుపత్రి నుంచి బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది.. నిజామాబాద్ 1వ టౌన్ ఎస్ హెచ్ వో రఘుపతి తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 18న కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రానికి చెందిన రాజు, లక్ష్మీలు రాత్రి జీజీహెచ్ ఆవరణలో ఇద్దరు పిల్లలతో నిద్రించారు. నాందేడ్ జిల్లాకు చెందిన అంజూమ్ బేగం ఆమె పది సంవత్సరాల కూతురు, దుర్గప్రభు రావుబా మోహితే అను ముగ్గురు తల్లిదండ్రుల పక్కన నిద్రిస్తున్న మణికంఠ(1)ను ఎత్తుకుని వెళ్లిపోయారు. బస్టాండ్ వద్ద ఆటో మాట్లాడుకుని రైల్వేస్టేషన్ కు వెళ్లి నాందేడ్ వెళ్లేందుకు ప్రయత్నించారు. రైలు అనుకున్న సమయానికి లేకపోవడంతో ఆటోలో బోధన్ రోడ్డులోని నాందేడ్ కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో సీసీటీవీ పుటేజిల ఆధారంగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడిని కిడ్నాప్ చేసిన ఇద్దరు మహిళలపై ఏమైనా పాత కేసులు ఉన్నాయా అని విచారిస్తున్నామని తెలిపారు. వారిద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. బాలుడి కిడ్నాప్ కేసును చాకచక్యంగా చేదించడంలో ఏఎస్సై షకీల్, కానిస్టేబుళ్లు గంగారాం, అనూష, కేర్భాజి, రాములును అభినందించారు.

## సామాజిక స్పృహా మేధావులకే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ టిక్కెట్లు ఇవ్వాలి

### - తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు



**ప్రజాజ్యోతి , నిజామాబాద్ బ్యూరో :** వచ్చే సంవత్సరం మార్చి నెలలో జరగబోయే కరీంనగర్ మెదక్ అదిలాబాద్, నిజామాబాద్ నియోజకవర్గాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో సామాజిక స్పృహ గల అణగారిన వర్గాల మేధావులకే టిక్కెట్లు కేటాయించాలని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు అన్ని పార్టీల అధినేతలను కోరారు. డాక్టర్ కేశవులు హాస్పిటల్ ఆవరణలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక నుంచి ఎన్నుకోబడ్డవాళ్ళు పెద్దల సభకు వెళ్తారని, పెద్దల సభకు వెళ్లేవాళ్లు నీతి నిజాయితీపరులై ఉండాలని, సామాజిక స్పృహ కలిగి తట్టస్తులైన మేధావులుగా పేరు ఉండాలని ముఖ్యంగా అణగారిన వర్గాల నుంచి వచ్చే తటస్థ మేధావులకే ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ సేవలకు, ప్రజా సంఘాల ముఖ్యులకు , సామాజిక స్పృహ గల, నీతి నిజాయితీపరులకు టిక్కెట్లు ఇచ్చి పెద్దల సభ గౌరవాన్ని కాపాడాలన్నారు. పెద్దల సభకు వెళ్లే వాళ్ళు నిరుద్యోగుల అవస్థల గురించి, యువత గురించి పట్టించుకునే వాళ్లై ఉండాలని, నేటికీ నిరుద్యోగ భృతి గురించి మాట్లాడే వాళ్లే లేరని, ఉత్తర తెలంగాణలో చాలామంది ఉద్యోగాలు లేక ఇల్లు గూడు కొరకు గల్ఫ్ దేశాలలో వెళ్లి హీనమైన స్థితిలో బతుకుతున్నారని, బీడీలు చేయకపోతే బతికే పరిస్థితి ఉత్తర తెలంగాణలో లేదని చాలీచాలని జీతాలతో కూలీలతో జీవనాన్ని సాగిస్తున్నారని, అటువంటి కుటుంబాల నుంచి వచ్చిన వాళ్ళకే ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ కేశవులు అన్ని పార్టీలను డిమాండ్ చేశారు. యువకులు, నిరుద్యోగులు నిజాయితీగా ఓటును వినియోగించుకోవాలని డాక్టర్ కేశవులు కోరారు.

